క్లుప్తంగా

వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ

కొవ్వూరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకను బుధవారం పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి పుట్టిన రోజు కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు పంచారు. ఆశ్రమంలోని వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు గంధం బాబ్జీ, పీసీసీ సభ్యులు గెద్దం సాయిబాబా, తాళ్లపూడి మండల శాఖ అధ్యక్షుడు సాయన బాబురావు, జిల్లా కార్యదర్శి కొయ్యా వెంకట్రావు, మీసాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ జేసీబీ ప్రారంభం

కొవ్వూరు: స్థానిక పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసిన జేసీబీని గురువారం ప్రారంభించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఉదయం పది గంటలకు జేసీబీని ప్రారంభించనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు


మునిపల్లిలో ప్రత్యేక పుష్పాలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి గోవిందనామాలు, సహస్రనామ స్తోత్రాలు, పారాయణ జరిపించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడికి సత్కారం

నిడదవోలు: స్థానిక సత్య సాయి సంస్థల ఆధ్వర్యంలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. శ్రీకంఠయ్య, మద్దుకూరి పెద్ద కృష్ణయ్య, గంగుమళ్ల హనుమంతరావు, ఖండవిల్లి గోపాలస్వామి, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, కొత్తపల్లి నాగేశ్వరరావు, బలగం అప్పారావు, బొజ్జా పాపారావు, ఖండవిల్లి గోపాలస్వామి, ఖండవిల్లి రంగాచార్యులు పాల్గొన్నారు.

స్వామి వారి హుండీ ఆదాయం రూ.4.50 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీలను అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీల ద్వారా 34 రోజులకు రూ.4.5 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ వెల్లడించారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. తీపర్రు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య సమక్షంలో జరిగిన హుండీల లెక్కింపులో అన్నవరప్పాడు గ్రామ పెద్దలు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, యాళ్ళబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


తాళ్లపూడిలో సమావేశమైన మండల రిటైర్డ్ ఉద్యోగులు

తాళ్లపూడి: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు మారిశెట్టి నాగేశ్వరరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ ప్రత్యేక సమావేశాన్ని బుధవారం తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు సమావేశంలో చర్చించారు. గత ప్రభుత్వంలో ఎదురైన ఇబ్బందులు కొత్త ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి వి.చంద్రయ్య, బాపిరాజు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు రక్షిత నీరు


సమిశ్రగూడెంలో రక్షిత మంచినీటి పథకం


అపరిశుభ్రంగా ఉన్న నీటి వాల్వ్

- ఈనెల 30 వరకూ వాటర్ ట్యాంకుల శుభ్రతకు స్పెషల్ డ్రైవ్
- తాగునీరు కలుషితం కాకుండా చర్యలు
- నియోజకవర్గంలోని 100 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు
- ఇప్పటికే 26 ట్యాంకుల పరిశుభ్రం

నిడదవోలు రూరల్: గ్రామీణులకు స్వచ్ఛమైన రక్షిత తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన జాగ్రత్తలు మొదలు పెట్టారు. ముఖ్యంగా గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్), గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ (జీఎల్ఎస్ఆర్)లకు నీటిని సరఫరా చేసే మంచినీటి పైపులు లీకై నీరు కలుషితం అవుతోంది. ఇలా లీకయ్యే పైపులను సకాలంలో గుర్తించకపోవడం, వాటి నుంచి సరఫరా అయ్యే నీటిని తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాలతో రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిడదవోలు నియోజకవర్గం పరిధిలోని నిడదవోలు మండలంలో 50, ఉండ్రాజవరం మండలంలో 21, పెరవలి మండలంలో 29 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. వీటిని ఈనెల 30వ తేదీ లోగా శుభ్రం చేసేందుకు ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లోని 26 ట్యాంకులను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు.



ట్యాంకుల వద్ద శుభ్రపరిచే తేదీ లేకుండా ఖాళీగా దర్శనమిస్తున్న బోర్డులు

క్షేత్రస్థాయిలో అలసత్వం

విధిగా ప్రజలకు రక్షిత తాగునీటినే అందించాలంటూ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద వాల్వ్ అపరిశుభ్రంగా ఉంది. అలాగే లీకేజీలతో కలవచర్ల గ్రామంలో తాగునీరు కలుషితం అవుతోంది. ఫలితంగా ఈ నీటిని తాగేందుకు ఆ గ్రామస్తులు ఆసక్తి చూపడం లేదు. నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ట్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులపై ఆయా ట్యాంకులను ఎప్పుడు శుభ్రపరిచిందీ తెలిపే తేదీలను పేర్కొనాలి. అయితే పలు గ్రామాల్లో ఆ బోర్డులు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి.

తాగునీటి శుభ్రపరిచే చర్యలు ఇలా..

- ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలి. అలాగే ఆయా ట్యాంకుల వద్ద శుభ్రం చేసే తేదీ, తిరిగి శుభ్రం చేయబోయే తేదీని పేర్కొనాలి.
- ప్రతి 20 లీటర్ల నీటికి 0.50 ఎంజీ క్లోరిన్ ట్యాబ్లెట్ కలపాలి. తాగునీటిని సరఫరా చేసే పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి.


ట్యాంకు లోపల శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

- గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి.
- రక్షిత మంచినీటి ట్యాంకుల పరిసరాల్లో నీరు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంచాలి.
- ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలోని నీటి పథకాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ముఖ్యంగా తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు



గ్రామీణులకు రక్షిత మంచినీటిని అందించేందుకు, పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించేందుకు ఈనెల 30 వరకూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 26 ట్యాంకులను శుభ్రం చేయించాం. జల్‌జీవన్ మిషన్ నిధులతో పలు గ్రామాల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి కలుషిత తాగునీటి సరఫరా నివారణకు చర్యలు చేపట్టాం. ఆయా ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం.

–టి.శ్రీనివాస్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, రాజమహేంద్రవరం

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన


సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం విజయనిర్మలకుమారి

నల్లజర్ల: ప్రపంచ సికిల్ సెల్ (రక్తంలో హిమోగ్లోబిన్‌పై ప్రభావం చూపే) దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లజర్లలోని మండల ఐకేపీ కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం విజయనిర్మల కుమారి మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యు సంబంధమైందన్నారు. గిరిజనుల్లో ఎక్కువగా వచ్చే ఈ వ్యాధిని ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. సీహెచ్ఓ పలివెల ప్రసాద్ మాట్లాడుతూ సికిల్ వ్యాధి వారసత్వంగా వచ్చే వ్యాధి అన్నారు. ఆరోగ్యకరమైన వ్యక్తిలో రక్త కణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధి సోకిన వారిలో అవి అర్ధ చంద్రాకారంలో ఉంటాయన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పచ్చబడడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అవయవ వైఫల్యం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలోని 17 రాష్ట్రాల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఉన్నట్టు మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ గుర్తించినట్టు చెప్పారు. నలభై ఏళ్ల లోపు వయసు గిరిజనులలో ఈ వ్యాధి ఉన్నట్టు గుర్తించారన్నారు. ఆశ, ఏఎన్ఎంలతో ప్రతి ఇంటా సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆఫీసు వద్ద ఫొటోగ్రాఫర్ల నిరసన


గోపాలపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఫొటోగ్రాఫర్లు


గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును సన్మానించి, వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గోపాలపురం: తమకు రావాల్సిన బకాయి సొమ్ములను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వీడియో కవరేజ్ చేసిన ఫొటోగ్రాఫర్లు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎన్నికల ప్రారంభం నుంచి 20 మంది ఫొటోగ్రాఫర్లను ఎన్నికల విధులకు ఉపయోగించుకొన్నారని వారు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి 14 రోజులైనా ఇప్పటి వరకూ తమకు బకాయిపడిన సుమారు రూ.20 లక్షలు చెల్లించకుండా తహసీల్దార్ నిరంకుశ వైఖరి అవలంభిస్తున్నారంటూ ఫొటోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమ బకాయిలు చెల్లించాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ డి.వనజాక్షిని వివరణ కోరగా ఫొటోగ్రాఫర్లు సమర్పించిన బిల్లులను ట్రెజరీకి పంపగా వాటిని వెనక్కి తిప్పి పంపారని బదులిచ్చారు. అయితే బిల్లుల్లో తేడా ఉండడంతో, వారిని సరి చేసి మరోసారి ట్రెజరీకి పంపుతామని చెప్పారు.

ఎమ్మెల్యే మద్దిపాటికి వినతి

నల్లజర్ల: సార్వత్రిక ఎన్నికల్లో తమతో 59 రోజుల పాటు వివిధ టీమ్‌లలో పని చేయించుకొని తీరా పారితోషికం ఇచ్చేటపుడు కోత విధిస్తున్నారని, తమకు పూర్తి పారితోషికం ఇప్పించాలని గోపాలపురం నియోజకవర్గ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును సన్మానించి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను రెండుసార్లు కలసి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. మొత్తం 56 మంది పనిచేశామని ఇంతవరకూ రూ.6,70,000 ఇచ్చారని మరో రూ.2.70 లక్షలు రావాల్సి ఉందన్నారు. సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వీడియోగ్రాఫర్స్ గూడూరి సుబ్రహ్మణ్యం, చంద్రరావు, బాలు, కిశోర్, పూర్ణ, రామకృష్ణ, మణికంఠ, సాయి కుమార్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కన్నుమూత


కడియం: కడియపులంక మాజీ సర్పంచ్ పుల్లా మాణిక్యం వృద్ధాప్యంతో కన్నుమూశారు. ఇక్కడ 2001–06లో మాణిక్యం సర్పంచ్‌గా పనిచేశారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారుల్లో ఒకరైన పుల్లా రామారావు కూడా కడియపులంకకు సర్పంచ్‌గా పనిచేశారు. మాణిక్యం కుటుంబ సభ్యులను మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వివిధ పార్టీల నాయకులు, నర్సరీ రంగ ప్రముఖులు పరామర్శించారు.

బాలికల అక్రమ రవాణాను అరికడదాం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో, ఎంపీడీవో తదితరులు

తాళ్లపూడి: మహిళలు, బాలికలను మోసగించి అక్రమంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేసి బలవంతంగా లైంగిక వ్యాపారంలోకి దించుతున్న ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ కొవ్వూరు సీడీపీవో జి.మమ్మీ సూచించారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించే వివిధ అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజ్వల స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుధవారం నాటి కార్యక్రమంలో ఆ సంస్థ కో–ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడారు. బాలికల అక్రమ రవాణాపై పాఠశాలల్లోని విద్యార్థినులకు తమ సంస్థ తరపున అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మోసాలకు గురై ఇతర ప్రాంతాల్లో వ్యభిచార గృహాల్లో చిక్కుకున్న వారిని తమ సంస్థ ద్వారా ఆదుకుని తిరిగి సమాజంలో మంచిగా జీవించే విధంగా భరోసా కల్పిస్తున్నామని అన్నారు. మోసగించబడిన వారిలో ఎక్కువ మంది ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 16 ఏళ్ల వయసు పైబడిన యువతులని ఆమె అన్నారు. సీడీపీవో మమ్మీ మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ పట్ల తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయల ధరలు


తాళ్లపూడిలో విక్రయిస్తున్న కూరగాయలు

తాళ్లపూడి: కూరగాయల ధరలు మార్కెట్లో అమాంతం పెరగడంతో వినియోగదారులకు దిక్కు తోచడం లేదు. వేసవి ఎండలకు కూరగాయల దిగుబడి తగ్గడం, పంటలు దెబ్బతినడంతో వాటి సరఫరా తగ్గింది. ఈ పరిస్థితులు కూరగాయల రేట్ల పెరుగుదలకు కారణమయ్యాయి. ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం ఉండకపోవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. తాళ్లపూడిలో కిలోల వారీగా కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. ఉల్లి రూ.40, పచ్చిమిర్చి రూ.80, ఆకాకర రూ.220, బీర రూ.80, కాకర రూ.60, క్యారెట్ రూ.60 రేటు పలికాయి. టమాటా రూ.100, బంగాళాదుంప రూ.40, బెండ, దొండ రూ.60, వంకాయలు రూ.80 రేటుకు అమ్ముడయ్యాయి. చిలకడదుంప రూ.60, క్యాప్సికం రూ.80, దోస రూ.40, అల్లం రూ.200, బీట్‌రూట్ రూ.80గా ఉన్నాయి. మామిడికాయ ఒక్కొక్కటి రూ.15 రేటు పలుకుతోంది. ధరలు పెరగడంతో కూరగాయల కొనుగోలుకు వినియోగదారులు వెనుకాడున్నారు.

మధ్యతరగతి బతుకులు భారం

మార్కెట్లో కూరగాయల ధరలకు తోడు మిగిలిన అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల నెలవారీ బడ్జెట్ తలకిందలవుతోంది. నెలవారీ సంపాదన ఏ మూలకూ చాలడం లేదని గృహిణులు వాపోతున్నారు. మార్కెట్‌కు రూ.1500 తీసుకెళితే నాలుగు రోజులకు సరిపడేంత సరుకులు కూడా రావడం లేదంటున్నారు. రూ.300 తీసుకుని మార్కెట్‌కు వెళితే నాలుగు రోజులకు సరిపడా కూరగాయలు వచ్చే పరిస్థితులు కనబడడం లేదంటున్నారు. రోజువారీ కూలీలు, పేదల పరిస్థితి మరింత ఘోరంగా మారింది. దీంతో వారు చాలీచాలని ఆహారంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కొత్త పంటలు వస్తే కానీ కూరగాయల ధరలు తగ్గే పరిస్థితి లేదని వ్యాపారులు అంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


మండలంలోని హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ–1 సత్యనారాయణ

నల్లజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ–1 వై. సత్యనారాయణ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈఓ పలు అంశాలు ప్రస్తావించారు. బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరేలా చూడాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న అమ్మకు వందనం, స్టూడెంట్స్ కిట్స్, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య వంటి విషయాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థికి వివిధ అంశాలపై అవగాహన కలిగేలా విద్యా ప్రకాష్ 90 రోజుల కార్యక్రమాన్ని అందరూ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎంఈఓ –2 భగవతి, సీఆర్పీసుజాత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి కళా సమ్మేళన్ సంగీత పోటీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, శ్రీరాధాకృష్ణ ట్రస్టు ద్వారా గురువారం నుంచి 23వ తేదీ వరకూ అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు నిర్వహించనున్నామని నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ఆనం కళాకేంద్రంలో నగరపాలక సంస్థ, గెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కళా సమ్మేళన్ నిర్వహిస్తున్నామన్నారు. రోజూ 100 మంది కళాకారులు వారి ప్రతిభను కనబరుస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ కార్యక్రమాలు ఉంటాయన్నారు. బెంగళూర్, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మలేషియా, యూఎస్ నుంచి కళాకారులు హాజరవుతారని అన్నారు. 21న 150 మంది విద్యార్థులు ఒకే ఆహార్యంలో కనకధారా స్తోత్రాన్ని 16,200 సార్లు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల పాటు నిర్విరామంగా ప్రదర్శిస్తారన్నారు. ఎటువంటి రుసుం లేకుండా కళాకారుల ప్రతిభను గుర్తించడానికి ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. మన సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఈ బాధ్యతను తీసుకున్నామన్నారు. కనుమరుగవుతున్న జావళీలను కళాకారులు ప్రదర్శించనున్నారన్నారు. కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, సంగీతం తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి సంగీత నాట్యాచార్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరవుతారన్నారు. నగరంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున సంగీతాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హిందూ ధర్మ పరిరక్షకుడు శివాజీ


కొవ్వూరు రాజీవ్ కాలనీలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు: జ్యేష్ఠ మాసంలోని మొదటి పక్షం 13వ రోజు ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేకం చేసిన ఘడియలను పురస్కరించుకుని స్థానిక రాజీవ్ కాలనీలో బుధవారం సాయంత్రం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఛత్రపతి శివాజీ మహాసేన వ్యవస్థాపకుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ నాయకుడు కొమ్ము సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ వీరోచితంగా పోరాడారన్నారు. హిందూ ధర్మాన్ని నాశనం చేయాలని చూసిన విదేశీ మూకలను ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. అనంతరం కోదండ రామాలయం వద్ద నిర్వహించిన హిందూ సామ్రాజ్య దినోత్సవంలో ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ సహ కార్యవాహ్ మోహన్‌కృష్ణ శివాజీ చరిత్రను వివరించారు. బీజేపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ బీవీ ముత్యాలరావు, ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, గండ్రోతు పవన్ సోమరాజు, ఆర్ఎస్ఎస్ నాయకులు గోవర్ధనం శ్రీనివాస మూర్తి, వైకే శ్రీనివాస్, కొండపల్లి రత్నసాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

కంబాలచెరువు: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అందజేశారు. డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఫండ్ నుంచి పోలీసు అధికారుల పిల్లలు 56 మందికి స్కాలర్‌షిప్‌లను స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. అనంతరం స్కూల్ యాజమాన్యాలను కూడా ఎస్పీ సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించినందుకు పిల్లలను అభినందించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలని, కలలను సాకారం చేసుకోవడానికి కష్టపడి చదవాలన్నారు. విజయవంతమైన వ్యక్తులుగా ఎదగాలని, ఉన్నత శిఖరాలు, లక్ష్యాలను సాధించాలని కోరారు. పిల్లలు తమకు కావాల్సిన వృత్తిని అభ్యసించి, సమాజానికి మేలు జరిగేలా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు (ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు, ఆర్ఐ, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.